నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, ఎయిర్‌పోర్ట్, ప్రకాష్ నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట పోస్టాఫీసు, గీతాంజలి స్కూల్, బేగంపేట్ రైల్వే స్టేషన్, ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ, పీఎఫ్ క్వార్టర్స్, బ్రాహ్మణవాడీ, వరుణ్ టవర్స్ లేన్, మాతాజీనగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హుడా లేన్, చిరాన్‌పోర్ట్ క్లబ్, పాస్‌పోర్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 41, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 11, క్యారెట్ 35, దొండ 45, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 28, కీర 19, దోసకాయ 21, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 37, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 10–15, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు రండి



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

సనత్‌నగర్: భువనగిరి వద్ద శ్రీస్వర్ణగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు హాజరుకావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆలయ నిర్వాహకులు ఆహ్వానాన్ని అందజేశారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ మానేపల్లి మురళి, మానేపల్లి గోపిలు ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవను కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వానం, జ్ఞాపికలను అందజేశారు. వారి వెంట రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి విశేష అలంకరణ



ప్రత్యేక పూజల్లో భక్తులు..



సనత్‌నగర్: ధనుర్మాస పూజోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి విశేష అలంకరణతో పాటు తిరుప్పావై పాశురాల పారాయణం, విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కాటం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: స్వయం ఉపాధి ఏర్పరచుకునేందుకు నిరుపేద మహిళకు బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అండగా నిలిచారు. గోవర్ధన్ గిరిధర్‌రెడ్డి, తల్లి రమాదేవిలకు ఆన్‌లైన్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు కోసం రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందించి మరోసారి ఉదాతరను చాటుకున్నారు. ఈ సందర్భంగా వెల్లాల మాట్లాడుతూ స్వయం ఉపాధిని ఏర్పరచుకుని తమకు తాము వృద్ధిలోకి రావడమే కాకుండా నలుగురికి ఉపాధి కల్పించవచ్చన్నారు.



ఒక్క రోడ్డు.. బోలెడు సమస్యలు

నిత్యం దుర్వాసన, మురుగు ప్రవాహం, చెత్త, అక్రమ పార్కింగ్



పట్టించుకోని అధికారులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ ప్రధాన రహదారిలో వెళ్లాలంటే చుక్కలు కనిపిస్తాయి. అధికారులు ఉదాసీన వైఖరి..ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం ఈ రహదారి పాలిట శాపంగా మారింది. నిత్యం తీవ్ర దుర్వాసన..దుర్గంధం..మురికినీటి ప్రవాహం, అక్రమ పార్కింగ్‌లతో ఈ రోడ్డు అధ్వానంగా తయారైయింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రహదారి సమస్యలకు నిలయంగా మారింది. ప్రధాన రహదారి పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇంటర్నల్ రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందనేది వాస్తవం. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతున్నది. ప్రధాన రహదారిలో ఇన్ని సమస్యలు ఉంటే అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఒకప్పుడు ఎంతో విశాలంగా ....రాకపోకలకు అనువుగా ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతం సమస్యలతో ఉక్కిబిక్కిరి అవుతున్నది.

సమస్యలు అన్నీ ఇన్నీ కావు

- నిత్యం మురికినీటి ప్రవాహం కారణంగా దోమలు వృద్ధి చెంది తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు చెత్తను ఇక్కడే వస్తుండటంతో ఈ సమస్య నెలకొంది.
- గాంధీ ఆసుపత్రి, పక్కనే ఉన్న కాలనీ డ్రైనేజీ మ్యానుహోల్స్ నుంచి నిత్యం మురికినీటి ప్రవాహం కారణంగా ఈ రహదారి కంపు కొడుతున్నది. ఎప్పటికప్పుడు డ్రైనేజీ మ్యానుహోల్స్‌ను శుభ్రం చేయాల్సిన జలమండలి అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో మురికినీరు ఏరులైపారుతున్నది.
- రోడ్డుకు ఇరువైపులా లారీలు, డీసీఎంలు పార్కు చేస్తున్నారు. నెలల తరబడి నుంచి వీటిని తొలగించడం లేదు. దీంతో చీకటి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఇంత సమస్య ఉంటే ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు.
- పద్మారావునగర్ పాత గరుండా సూపర్ మార్కెట్ నుంచి పాల్‌బాగ్ హనుమాన్ దేవాలయం వరకు ఫుట్‌పాత్‌ల అక్రమణలతో ఈ రహదారి కుచించుకుపోయింది. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదు.
- కొందరైతే ఫుట్‌పాత్‌లు, రోడ్లను అక్రమించుకొని ఇసుక, మట్టి, ఇటుకల వ్యాపారం చేస్తున్నారు. ప్రజలు ఫుట్‌పాత్‌లపై రాకపోకలు సాగించాలంటే కష్టం తయారైంది. లక్షలాది రూపాయల వ్యయంతో జీహెచ్ఎంసీ ఫుట్‌పాత్‌లను నిర్మించినా ఆక్రమణల కారణంగా ఎందుకు పనికిరాకుండా మారాయి.
- రాత్రి వేళల్లో చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భవన నిర్మాణ దారులు వ్యర్థాలను తీసుకువచ్చి ఇక్కడ రాసులుగా పొస్తున్నారు. వ్యర్థాల కారణంగా ఈ రహదారి అధ్వానంగా మారింది. జీహెచ్ఎంసీ, జలమండలి, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వర్సిటీల్లో మెస్ చార్జీల స్కీంను పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల్లో విద్యార్థులకు ఫుల్ మెస్ చార్జీల స్కీంను పునరుద్ధరించాలని, ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన బీసీ విద్యార్థుల మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. వర్సిటీల్లో 1994 వరకు ఫుల్ మెస్ చార్జీల స్కీం కొనసాగిందన్నారు. స్కీం రద్దుతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏడాదికి రూ.30 వేల మెస్ బిల్లులకు గాను రూ.15 వేలు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. గురుకుల విద్య సంస్థలు, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్, ఎనుగంటి రాజునేత, నీలం వెంకటేష్, మల్లేష్, రాజేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సనత్‌నగర్: విశ్వ మానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎర్రగడ్డ చౌరస్తాలోని సిగ్నల్స్ వద్ద ప్లకార్డులు పట్టుకొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకులు మస్తాన్‌రావు పెసల మాట్లాడుతూ రెడ్ సిగ్నల్ ఉన్నప్పటికీ ఎంతోమంది రోడ్డు దాటడం, వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకుండా ఉండడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం, అతివేగంగా, ర్యాష్‌గా డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో చందు, సునీల్, లక్ష్మణ్, విజయ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న విశ్వమానవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

పార్కుల అభివృద్ధికి చర్యలు



ఉద్యానవన శాఖ మేనేజర్ జ్యోత్స్నను సన్మానిస్తున్న మోడల్‌కాలనీ ప్రతినిధులు

సనత్‌నగర్: పార్కుల అభివృద్ధికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఉద్యానవన శాఖ మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. ఆదివారం మోడల్‌కాలనీ పార్కును సందర్శించిన ఆమె పార్కులో నెలకొన్న సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పార్కులో మరిన్ని మొక్కలను నాటాల్సిన అవసరం ఉందని, పార్కుల నిర్వహణ చార్జీలను పెంచాలని, పూర్తిస్థాయిలో పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. పార్కు అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై నివేదికను రూపొందించి జోనల్ కమిషనర్‌కు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజర్‌ను అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు.

జాతీయ మట్టి కళాబోర్డును ఏర్పాటు చేయాలి



ఎంపి ఈటల రాజేందర్‌కు వినతి పత్రం ఇస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

లాలాపేట: జాతీయ మట్టి కళాబోర్డును ఏర్పాటు చేయాలని అఖిల భారతీయ ప్రజాపతి(కుంభకర్) మహాసంఘ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కుమ్మర్లను వివిధ పేర్లతో గుర్తించడం ద్వారా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే సంక్షేమ పథకాల ఫలాలను పొందలేకపోతున్నామన్నారు. తెలంగాణలో దాదాపు 14 లక్షలకు పైగా ఉన్న వారు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలియజేశారు. వారంతా కుమ్మర్లు కులవృత్తినే నమ్ముకుని సరైన అభివృద్ధి లేక దయనీయమైన జీవితం జీవిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మల్లికంటి వీరన్న, రాష్ట్ర అధ్యులు మిరుదొడ్డి శివానంద్, ప్రధాన కార్యదర్శి జై వీర శంకర్ పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్ పోటీల్లో సత్తాచాటిన చిన్నారులు



అమీర్‌పేట్: జిమ్నాస్టిక్స్ ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం ధరమ్‌కరం రోడ్డులోని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జిమ్నాస్టిక్స్ ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ కాంపిటీషన్‌లో నగరంలోని పలు ప్లే స్కూళ్లకు చెందిన అండర్–4 విభాగం చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో అనన్య దొచానియా మొదటి స్థానంలో నిలవగా, అలియాహ్ రెండో స్థానంలో, మూడో స్థానంలో అక్షయిని గెలుపొందినట్లు కోచ్‌లు మహేష్ కుమార్, జి. బ్రహ్మానంద్ ప్రసాద్ తెలిపారు. పోటీల్లో 100 మంది పాల్గొన్నారన్నారు.

నేడు టీఎన్జీవోస్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

కాచిగూడ: టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 6వ తేదీన సోమవారం సాయంత్రం 5 గంటలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు లలిత కళా తోరణం ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నిర్వహిస్తున్నట్లు భాగ్యనగర్ టీఎన్జీవోస్ మాక్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు,సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్ తెలిపారు. టీఎన్జీవోస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు పలువురు మంత్రులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ డైరీ, కేలండర్‌తో పాటు టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా, టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ సిటీ, భాగ్యనగర్ టీఎన్జీవోస్ మాక్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌ల క్యాలెండర్ల ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి : ఎమ్మెల్యే శ్రీగణేశ్



ఎమ్మెల్యే శ్రీగణేశ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన జహంగీర్ అజ్జు, ఇతర నేతలు

కంటోన్మెంట్: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే కంటోన్మెంట్ అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయన్నారు. ఆదివారం కంటోన్మెంట్ రెండో వార్డుకు చెందిన బీఆర్ఎస్ జహంగీర్ అజ్జు ఆధ్వర్యంలో పలువురు అనుచరులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో వేల కోట్ల నిధులతో ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం త్వరలోనే ప్రారంభం కాబోతుందన్నారు. ఇక నియోజకవర్గం పరిధిలో సుమారు 6 వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు దక్కనున్నాయని అన్నారు. అదే సమయంలో రక్షణ భూముల్లోని బస్తీవాసులకు పట్టాలు ఇప్పించే ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి



తార్నాక చింతల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

లాలాపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర నాయకులు తుంగ లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు అంబేడ్కర్ జ్ఞాన మాల సమర్పణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తార్నాకలోని చింతల్ బస్తీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో హరిబాబు, మనోహర్, ప్రసన్న, చింతల్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న నలుగురిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... బేగంపేటకు చెందిన శ్రీకృష్ణానగర్‌కు చెందిన ప్రవీణ్, మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన సాయి ప్రణీత్, మల్కాజిగిరి మధుసూదన్‌నగర్‌కు చెందిన జశ్వంత్‌లు యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో నిషేధిత మంజాను విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందటంతో ఆదివారం దాడి చేయగా వీరి వద్ద చైనా మాంజాను పోలీసులు గుర్తించారు. బేగంపేటలోని బాబా కైట్స్ నుంచి వీరు కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. వీరి వద్ద నుంచి రూ.15,000 విలువైన మోనో గోల్డ్ సింథటిక్ నైలాన్ కోటెడ్ చైనీస్ మంజా 20 బీటీన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ



అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ ప్రతీ వారం అంబేడ్కర్‌కు జ్ఞాన మాల వేస్తున్నామని, ఆదివారం నాల్గవ వారం జ్ఞాన మాల వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమక్క, బన్నమ్మ, మాధురి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

బంజారాహిల్స్: ప్రపంచ సర్వైకల్ కేన్సర్ అవగాహన మాసం సందర్భంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిలో ఈ నెల 6 నుంచి 31వ తేదీ వరకు అన్ని పనిదినాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఉచిత స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్లాక్–1 మొదటి అంతస్తులోని సర్జికల్ విభాగంలో ఈ క్యాంపు జరుగుతుందని చెప్పారు. కేన్సర్‌ను ఎలా నివారించాలి అన్న అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ సెర్వికల్ కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపులో వైద్యులు ఉచితంగా ప్రాథమిక పరీక్షలు నిర్వహించి కేన్సర్ లక్షణాలను నిర్ధారించే ప్రయత్నాలను చేస్తారన్నారు. అనుమానం ఉన్న వారికి 50 శాతం రాయితీతో పాటు, ఇతరత్రా వ్యాధి నిర్ధారణ పరీక్షలను 20 శాతం రాయితీతో చేస్తారని వివరించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

సికింద్రాబాద్: వేర్వేరు చోట్ల ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఈ నెల 4న సాయంత్ర 6 గంటల సమయంలో రేపల్లె నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫామ్ నంబర్ 5కు చేరుకున్న రైలు బోగీలో సుమారు 40–45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. గుండెపోటులో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

మరో ఘటనలో..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 6వ నంబర్ ప్లాట్ ఫామ్‌కు శనివారం రాత్రి 8 గంటల సమయంలో మౌలాలి షెడ్ నుంచి వచ్చిన ఖాళీ బోగీలో సుమారు 70–75 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం కనిపించింది. అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు.

వ్యక్తి అదృశ్యం



సెబస్టీన్ రాజ్

సనత్‌నగర్: తమిళనాడు నుంచి వలసవచ్చి బేగంపేటలో ఉంటున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. బేగంపేట ఎస్ఐ నాగరాజు తెలిపిన మేరకు.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సెబస్టీన్ రాజ్ (51) బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. గత సంవత్సరం ఆగస్టు 29వ తేదీన శాంలాల్‌బిల్డింగ్ నుంచి సికింద్రాబాద్‌కు కుటుంబసభ్యులతో కలిసి వెళ్తుండగా కనిపించకుండాపోయాడు. దీంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బేగంపేట పోలీసులను ఆశ్రయించారు. బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.